క్లుప్తంగా

చెత్త సంపద కేంద్రం పరిశీలన



సాక్షి ఎఫెక్ట్

పొన్నూరు: మండలంలోని వల్లభరావుపాలెంలో చెత్త నుంచి సంపద కేంద్రాన్ని వినియోగంలోకి తీసుకువచ్చేలా చర్యలు చేపడతామని ఈఓపీఆర్‌డీ మల్లికార్జున రావు తెలిపారు. ఈ నెల 3వ తేదీన లక్ష్యానికి తూట్లు. ప్రజలకు పాట్లు శీర్షికన సాక్షిలో ప్రచురితమైన కథనంపై మండల పరిషత్ అధికారులు స్పందించారు. రోడ్డుపై అధ్వానంగా ఉన్న చెత్తను తొలగించారు. సోమవారం గ్రామంలోని చెత్త సంపద కేంద్రాన్ని పరిశీలించి, వివరాలు సేకరించారు.

భక్తిశ్రద్ధలతో అమ్మవారికి సారె సమర్పణ



పొన్నూరు: పట్టణంలోని శ్రీ వేంకటేశ్వర స్వామి దేవస్థానంలో ధనుర్మాసాన్ని పురస్కరించుకుని సోమవారం గోదాదేవి అమ్మవారికి సారె కార్యక్రమం మహిళలు అత్యంత భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ప్రత్యేక పూజలు చేసి అమ్మవారికి సారె, వడిబియ్యం సమర్పించి తీర్థప్రసాదాలు స్వీకరించారు. అనంతరం పట్టణ ప్రధాన వీధుల్లో గ్రామోత్సవం వైభవంగా నిర్వహించారు. కార్యక్రమంలో తిరుప్పావై సంఘ సభ్యులు, భక్తులు విశేష సంఖ్యలో పాల్గొన్నారు.

గైర్హాజరయ్యే విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ

ప్రత్తిపాడు: పాఠశాలకు గైర్హాజరయ్యే విద్యార్థులపై ప్రత్యే శ్రద్ధ తీసుకోవాలని చినకోండ్రుపాడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఎస్ఎంసీ చైర్మన్ పోతురాజు లక్ష్మీనారాయణ అన్నారు. స్థానిక కళాశాలలో సోమవారం పాఠశాల యాజమాన్య కమిటీ సమావేశాన్ని నిర్వహించారు. విద్యార్థులతో మాట్లాడారు, సమస్యలు తెలుసుకున్నారు.

కాలువ పూడికతీత పనులు ప్రారంభం

ప్రత్తిపాడు: కాలువపూడిక తీత పనులను త్వరితగతిన పూర్తి చేసి రైతులకు సక్రమంగా సాగు నీరు అందేలా చర్యలు తీసుకోవడం జరుగుతుందని వంకాయలపాడు మేజర్ డీసీ కమిటీ ప్రెసిడెంట్ అయినంపూడి నాగేశ్వర రావు అన్నారు. మండల పరిధిలోని కోయవారిపాలెం సమీపంలోని వంకాయలపాడు మేజర్ పంట కాలువ పూడిక తీత పనులను సోమవారం డీసీ కమిటీ ప్రెసిడెంట్ నాగేశ్వరరావు స్థానిక నాయకులతో కలిసి ప్రారంభించారు. పొక్లెయిన్ వద్ద పూజలు చేసి కొబ్బరి కాయలు కొట్టి పనులను ఆరంభించారు. కాలువలో పెద్ద ఎత్తున పెరిగిపోయిన తూటాకు, మొక్కలను తొలగించారు. ఈ సందర్భంగా నాగేశ్వరరావు మాట్లాడుతూ కాలువలు సక్రమంగా లేకపోవడంతో ఏటా రైతులు ఇబ్బందులు పడాల్సి వస్తుందన్నారు. అందు వలన ప్రభుత్వం పంటకాలువలపై దృష్టి సారించిందన్నారు. కార్యక్రమంలో గింజుపల్లి వెంకటేశ్వర రావు, శివరాంప్రసాద్, డి.భాగ్యారావు, కె.సుబ్బారెడ్డి పాల్గొన్నారు.

నాణ్యమైన భోజనం అందించాలి



ప్రత్తిపాడు: విద్యార్థులకు నాణ్యమైన మధ్యాహ్న భోజనం అందించాలని ఎంఈవో-2 జి. లీలారాణి అన్నారు. నియోజకవర్గ కేంద్రం ప్రత్తిపాడు ఉర్దూ ప్రాథమిక పాఠశాలను సోమవారం మధ్యాహ్నం ఎంఈఓ ఆకస్మికంగా తనిఖీ చేశారు. పాఠశాలలో అమలవుతున్న మధ్యాహ్న భోజనం పరిశీలించారు. విద్యార్థులతో మాట్లాడారు. అనంతరం పాఠశాలలో రిజిస్టర్లను పరిశీలించి, విద్యార్థుల విద్యా నైపుణ్యాలను పరీక్షించారు. ప్రతి రోజూ విద్యార్థుల వర్క్‌బుక్స్‌ను పరిశీలించాలని ఉపాధ్యాయుడు అబ్దుల్ సత్తార్‌ను ఆదేశించారు.

కొనసాగుతున్న కమిషనర్ కక్ష సాధింపు చర్యలు

నెహ్రూనగర్: జనవరి 4వ తేదీన జరిగిన కౌన్సిల్ సమావేశంలో డెప్యూటీ మేయర్, కమిషనర్ తమాషా అన్న పదాన్ని భూత అద్దంలో కమిషనర్ పులి శ్రీనివాసులు చూపుతూ కక్ష సాధింపు చర్యలకు దిగారు. ఇందులో భాగంగా మేయర్, డెప్యూటీ మేయర్ల వద్ద పనిచేస్తున్న పలువురి సిబ్బందిని తొలగించిన విషయం తెలిసిందే. తాజాగా సీ సెక్షన్, కౌన్సిల్ సూపరింటెండెంట్‌గా నాలుగేళ్లుగా పనిచేస్తున్న ఎస్‌వీవీఎస్ మదన్‌గోపాల్‌ని ఆర్వోగా బదిలీ చేశారు. ఆయన స్థానంలో కౌన్సిల్ సెక్రటరీగా విధులుగా నిర్వహిస్తున్న పి.శ్రీనివాసరావును అదనంగా కౌన్సిల్ సూపరింటెండెంట్‌గా విధులు నిర్వహించాలని సోమవారం ఉత్తర్వులు జారీ చేశారు.

దళారుల పంట పండింది

- ధాన్యం విక్రయాల్లో వ్యాపారులదే హవా
- అన్నదాతలు దక్కని మద్దతు ధర
- కొనుగోలు కేంద్రాల్లో నిబంధనల కొర్రీ



నంబూరు శివార్లలో ఆరబెట్టిన ధాన్యం(ఫైల్)

పెదకాకాని: ధాన్యం రైతు దగా పడుతున్నాడు. ఆరుగాలం శ్రమించిన రైతుకు మార్కెట్లో నిరాశ ఎదురవుతోంది. నిబంధనలతో ప్రభుత్వ కొనుగోలు కేంద్రాల్లో కొనుగోళ్లు అంతంతమాత్రంగా సాగుతున్నాయి. దీంతో దళారులు రెచ్చిపోతున్నారు. తేమ వంటి సమస్యలు చూపి కల్లాల వద్దే చౌకగా ఎగరేసుకుపోతున్నారు.

కొనుగోలు కేంద్రాల వద్ద...

ప్రభుత్వం కొనుగోలు కేంద్రాల ద్వారా 75 కిలోల ధాన్యం బస్తాకు రూ.1,720 గిట్టుబాటు ధర ఇస్తున్నా, ఆ ధర పొందేందుకు ఆరుదల ఉండాలని, 17 శాతంలోపే తేమ ఉండాలంటూ పలు రకాల నిబంధనలు పెట్టడంతో రైతులు అటువైపు చూడడం లేదు. కొనుగోలు చేసిన వెంటనే నగదు చెల్లింపులు చేసే విధంగా దళారులు రూ.1,300 నుంచి రూ.1,500 ధరకు ధాన్యం కొనుగోలు చేస్తున్నారు. దీనితో బస్తాకు ఆయా రైతులకు రూ.200లకు పైబడి నష్టం వాటిల్లుతోంది. ధాన్యం అమ్మిన వెంటనే సొమ్ములు వస్తున్నాయనే ఆశతో నియోజకవర్గంలోని పొన్నూరు రూరల్, చేబ్రోలు, పెదకాకాని మండలాల్లో చాలామంది రైతులు దళారులు చెప్పిన ధరకు విక్రయాలు సాగిస్తున్నారు.

కొనుగోళ్లు అంతంత మాత్రమే !

ఖరీఫ్ సీజన్లో ధాన్యం కొనుగోలు ప్రభుత్వం శ్చుట్టినా గాని రైతుల నుంచి స్పందన అంతంత మాత్రంగానే కనిపిస్తోంది. పొలం నుంచి నూర్పిడి చేసిన ధాన్యాన్ని బస్తాలలో వేసి, తూకం తూయడం, ఆపై వాటిని లారీలలోకి ఎక్కించి, లోడు చేసి సూచించిన మిల్లుకు పంపించడం వంటి పనులతో ఇబ్బందులు పడలేక, దళారులకు పొలం నుంచే నేరుగా విక్రయాలు సాగిస్తున్నారు. అంతేకాక ఆర్బీకేల ద్వారా కొనుగోలు కేంద్రాల నుంచి ధాన్యం విక్రయాలు సాగించిన రైతులకు ఆయా నగదు బ్యాంక్ అకౌంట్‌లో జమ అయ్యేందుకు ఎక్కువ సమయం పడుతున్న నేపథ్యంలో దళారులకు విక్రయించడం ద్వారా నగదు రెండు, మూడు రోజులలోనే ఆయా రైతులు అందుకుంటున్నారు.

ఇబ్బందులు పడలేకనే..



ఖరీఫ్ సీజన్ ప్రారంభం నుంచి వర్షాలతో కొంత మేర ఇబ్బందులు పడ్డాం. ప్రస్తుతం ఎకరాకు 30 నుంచి 35 బస్తాల వరకు దిగుబడి వచ్చింది. ధాన్యాన్ని అమ్ముకోవడానికే ఇబ్బందులు పడుతున్నాం. ప్రభుత్వం నిర్ణయించిన విధంగా రైతు భరోసా కేంద్రాల ద్వారా ధాన్యాన్ని విక్రయించి, బస్తాకు రూ.1,720 గిట్టుబాటు ధర తీసుకోవాలనే ఆశ ఉన్నాగానీ, ఆయా నిబంధనలతో ఇబ్బందులు పడలేకనే పొలం నుంచే విక్రయాలు సాగిస్తున్నాం. డబ్బులు వెంటనే అందుతున్నాయి.

– భీమవరపు సతీష్‌రెడ్డి, రైతు, నంబూరు

పొలం వద్దే అమ్మేస్తున్నారు



కొనుగోలు కేంద్రాల వద్ద నిబంధనలతో అధికంగా ఇబ్బందులు పడే అవకాశం ఉంది. వారు చెప్పిన నిబంధనల ప్రకారం అమ్మటం చాలా కష్టం. ఎందుకంటే వాతావరణం కూడా అనుకూలంగా లేదు. హడావుడిగా యంత్రాలతో నూర్పిడిళ్లు చేయించాల్సి వచ్చింది. అమ్మిన ధాన్యం డబ్బులు ఎప్పుడు ఆయా రైతుల బ్యాంకు అకౌంట్లలో పడతాయో తెలీదు. వాటి కోసం ఎదురు చూడాలి. ఈ బాధలన్నీ పడలేకనే పండించిన ధాన్యాన్ని నేరుగా పొలం నుంచే విక్రయాలు చేసుకునేందుకు ఆసక్తిని చూపిస్తున్నారు.

–జంగా శ్రీనివాసరెడ్డి, రైతు, నంబూరు

అసెంబ్లీ ఓటర్ల తుది జాబితా విడుదల

- నియోజకవర్గ ఓటర్ల సంఖ్య 2,68,303
- ఐదు మండలాల్లోనూ మహిళా ఓటర్లే అధికం



వివరాలు వెల్లడిస్తున్న పొన్నూరు తహసీల్దార్ జియా

ప్రత్తిపాడు: నియోకవర్గ ఓటర్ల తుది జాబితా విడుదలయ్యింది. తుది జాబితా ప్రకారం నియోకవర్గ ఓటర్ల సంఖ్య 2,68,303కు చేరిపోయింది. ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు స్పెషల్ సమ్మరీ రివిజన్-2025ను నిర్వహించారు. అందులో భాగంగా బీఎల్‌వోలు గత ఏడాది ఆగస్టు నుండి అక్టోబరు 18 వరకు సుమారు రెండు నెలల పాటు ఇంటింటి సర్వే జరిపారు. మృతులు, వలస ఓటర్లతో పాటు మార్పులు, చేర్పులపై అర్జీలు స్వీకరించారు. అదే సమయంలో 2025 జనవరి ఒకటవ తేదీ నాటికి పద్దెనిమిది సంవత్సరాలు నిండే యువతీ, యువకులకు నూతన ఓటు హక్కు కల్పించేందుకు ఫారం-6 దరఖాస్తులు ఆన్‌లైన్, ఆఫ్‌లైన్‌లో స్వీకరించారు. 2024 అక్టోబరు 29న ముసాయిదా జాబితా విడుదల చేసి అభ్యంతరాలను స్వీకరించడంతో పాటు కొత్తగా వచ్చిన దరఖాస్తులను పరిశీలించి, విచారణ జరిపారు. ఈ నేపథ్యంలో సోమవారం ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు నియోకవర్గంలోని పోలింగ్‌బూత్‌ల వారీగా తుది ఓటర్ల జాబితాలను ప్రచురించారు.

పెరిగిన ఓటర్ల సంఖ్య..

నియోజకవర్గంలో ఓటర్ల సంఖ్య పెరుగుతూపోతుంది. 2019 సార్వత్రిక ఎన్నికల సమయంలో నియోజకవర్గంలోని ప్రత్తిపాడు, పెదనందిపాడు, కాకుమాను, వట్టిచెరుకూరు, గుంటూరురూరల్ మండలల్లో 2.50 లక్షలు ఉన్న ఓటర్ల సంఖ్య, 2024 ఎన్నికల సమయానికి 2.64 లక్షలకు చేరింది. స్పెషల్ సమ్మర్ రివిజన్ అనంతరం గత ఏడాది అక్టోబరులో ప్రచురించిన ముసాయిదా జాబితా ప్రకారం ఆ సంఖ్య 2.65 లక్షలకు పైగా చేరింది. తాజాగా ప్రచురించిన తుదిజాబితా ప్రకారం ఓటర్ల సంఖ్య 2.68 కు చేరింది. అంటే 2019 నుంచి ఇప్పటి వరకు సుమారు 18 వేల మంది ఓటర్లు పెరిగారన్న మాట. కాగా ఎప్పటిలానే ఐదు మండలాల్లోనూ మహిళా ఓటర్లే అత్యధికంగా ఉన్నారు.

పొన్నూరు: పొన్నూరు నియోజకవర్గంలో ఓటరు తుది జాబితాను తహసీల్దార్ మహమ్మద్ జియావుల్‌హక్ సోమవారం విడుదల చేశారు. కేంద్ర ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు జనవరి 6వ తేదీ వరకు సాధారణ ఎన్నికలకు సంబంధించిన ఓటరు సవరణలు, చేర్పులు, మార్పులు, నమోదు కార్యక్రమాలను నిర్వహించారు. గడువు ముగియడంతో తహసీల్దార్ కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో ఓటరు జాబితా వివరాలను ఆయన వెల్లడించారు. నియోజకవర్గంలో మొత్తం 2,27,503 ఓటర్లు ఉన్నారని తెలిపారు. అందులో పురుషులు 109196, మహిళలు 118296, ట్రాన్స్‌జెండర్లు 11 ఉన్నటు పేర్కొన్నారు. సమావేశంలో సీనియర్ అసిస్టెంట్లు హసన్ అహ్మద్, రామారావు, జూనియర్ అసిస్టెంట్ నాగేశ్వరరావు పాల్గొన్నారు. 2024 సెప్టెంబరు వరకు 227382 మంది ఓటర్లు ఉండగా, ప్రస్తుతం 121 మంది ఓటర్లు పెరిగారని తహసీల్దార్ తెలిపారు.

ఆయా మండలాల వారీగా ప్రచురించిన ఓటర్ల తుది జాబితా..

మండలం	పురుషులు	మహిళలు	థర్డ్‌జెండర్
గుంటూరు వెస్ట్	31,966	34,674	19
గుంటూరు ఈస్ట్	25,867	27,298	3
వట్టిచెరుకూరు	18,482	19,688	-
ప్రత్తిపాడు	19,760	21,007	-
పెదనందిపాడు	16,768	18,215	-
కాకుమాను	16,597	17,959	-
మొత్తం	1,29,440	1,38,841	22

బడి బయటి పిల్లలను బడిలో చేర్పించాలి



మాట్లాడుతున్న ఎంఈఓ కెనడీ

కాకుమాను: బడి బయట ఉన్న పిల్లలను గుర్తించి వారిని ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించే విధంగా ఉపాధ్యాయులతో పాటు పాఠశాల యాజమాన్య కమిటీ చైర్మన్‌లు కృషి చేయాలని ఎంఈఓ కె.ఎఫ్.కెనడీ అన్నారు. స్థానిక నన్నపనేని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో సోమవారం ఎస్ఎంసీ చైర్మన్‌లకు ఒక రోజు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా కెనడీ మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల బలోపేతానికి ఉపాధ్యాయులతో పాటు యాజమాన్య కమిటీ చైర్మన్‌లు కూడా కృషి చేయాలని కోరారు. గ్రామాలలో ఉన్న బడి బయట చిన్నారులను గుర్తించి వారిని ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించే విధంగా తగిన చర్యలు చేపట్టాలని సూచించారు. పదో తరగతి విద్యార్థులపై ఉపాధ్యాయులు ప్రత్యేక శ్రద్ధ తీసుకుని వారి అభ్యసన సామర్థ్యాలకు అనుగుణంగా పాఠ్యాంశాలు బోధించాలని కోరారు. కార్యక్రమంలో ఎంఈఓ-2 కె.విజయ్ భాస్కర్, హెచ్‌ఎం బి.సత్యం, ఎస్ఎంసీ చైర్మన్ గౌరు లక్ష్మి, రీసోర్స్ పర్సన్ రమాదేవి పాల్గొన్నారు.

విద్యార్థుల బంగారు భవిష్యత్‌కు మాస పత్రిక దోహదం

కాకుమాను: విద్యార్థుల బంగారు భవిష్యత్‌కు మనబడి మాస పత్రిక ఎంతగానో దోహదపడుతుందని ఎంఈఓ-2 కె.విజయ్ భాస్కర్ అన్నారు. స్థానిక మండల పరిషత్ ప్రాథమిక(మెయిన్)పాఠశాలలోని ఉపాధ్యాయులకు సోమవారం మన బడి మాసపత్రికలను అందజేశారు. ఈసందర్భంగా విజయ్ భాస్కర్ మాట్లాడుతూ విద్యార్థులకు సులభ పద్ధతిలో విద్యాబోధన అందించాలనే లక్ష్యంతో విద్యాశాఖ ఆధ్వర్యంలో ప్రతి నెల ప్రతి పాఠశాలకు మన బడి మాస పత్రికలను అందజేస్తున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో ఎంఈఓ కెనడీ పాల్గొన్నారు.

12న పాలపర్రులో సంక్రాంతి ఆటల పోటీలు

ప్రత్తిపాడు: సంక్రాంతి పండుగను పురస్కరించుకుని ఈ నెల 12వ తేదీన పెదనందిపాడు మండలం పాలపర్రులో పదో తరగతిలోపు విద్యార్థినీ, విద్యార్థులకు ఎస్ఎఫ్ఐ, డీవైఎఫ్ఐ, ఐద్వా ఆధ్వర్యంలో ఆటల పోటీలను నిర్వహించనున్నట్లు నిర్వాహకులు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. బాలురకు పరుగుపందెం, నడక పందెం, మోకు లాగుట, లెమన్ స్పూన్, బాలికలకు నడక పందెం, మోకు లాగుట, లెమన్ స్పూన్, మ్యూజికల్ చైర్, ముగ్గుల పోటీలు నిర్వహించనున్నట్లు చెప్పారు. ఆసక్తి ఉన్న వారు పోటీల్లో పాల్గొనాలని పేర్కొన్నారు.

మంచాల, శేకూరుల్లో గ్రామసభలు

చేబ్రోలు: చేబ్రోలు మండలం మంచాల, శేకూరు గ్రామాల్లో సోమవారం గ్రామసభలు నిర్వహించారు. రెండు గ్రామాల్లో జరిగిన గ్రామ సభల్లో పారిశుద్ధ్యం మెరుగుదలకు తీసుకోవాల్సిన చర్యలను వివరించారు. గత ఆర్థిక సంవత్సరం జమా ఖర్చులు, రాబోయే ఆర్థిక సంవత్సరం అంచనా బడ్జెట్‌ను తెలియజేశారు. పంచాయతీ అభివృద్ధి ప్రణాళిక యాక్షన్ ప్లాన్‌ను వివరించారు. ఆయా చోట్ల జరిగిన కార్యక్రమంలో గ్రామ పంచాయతీ సర్పంచులు చందు వెంకట సాంబశివరావు, మాతంగి శ్యామల పాల్గొన్నారు.

యువతి ఆత్మహత్యాయత్నం

చేబ్రోలు: కుటుంబ సమస్యలతో యువతి పురుగుమందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన ఘటన చేబ్రోలు మండలం వీరనాయకునిపాలెం గ్రామ పరిధిలో సోమవారం చోటుచేసుకుంది. గ్రామానికి చెందిన పి.రాజకుమారి కుటుంబ మనస్పర్థలతో కొద్ది రోజులుగా సతమతమవుతుంది. దీని నేపథ్యంలో ఇంటిలో పురుగుమందు తాగి ఆత్మహత్యాయత్నం చేసింది. బంధువులు గమనించి యువతిని 108తో తెనాలి ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

కనుల పండువగా దశావతార కల్యాణ మహోత్సవాలు



బలరామస్వామి కల్యాణ మహోత్సవం నిర్వహిస్తున్న అర్చకులు

గుంటూరు రూరల్: గోరంట్లలోని శ్రీ వేంకటేశ్వర స్వామి దేవాలయం(పెద్దగుడి)లో దశావతార కళ్యాణ మహోత్సవాలు ఆలయ కమిటీ ఆధ్వర్యంలో వైభవంగా నిర్వహిస్తున్నారు. కల్యాణ మహోత్సవాల సందర్భంగా ఆలయంలో ప్రత్యేక పూజలు అభిషేకాలు, హోమాలు నిర్వహించారు. సోమవారం ఎనిమిదో రోజు స్వామికి బలరామ అవతారం అలంకరించి కల్యాణ మహోత్సవాన్ని కన్నుల పండువగా నిర్వహించారు. వందల మంది భక్తులతో దేవాలయం కిక్కిరిసింది. కార్యక్రమంలో దేవాలయం ప్రెసిడెంట్ యర్రంశెట్టి వేణుగోపాల్, చైర్మన్ కంచర్ల ఆంజనేయులు, సెక్రెటరీ గజవల్లి శివన్నారాయణ, ట్రెజరీ దేవరశెట్టి సురేష్‌బాబు, వైస్ ప్రెసిడెంట్ ఆళ్ల శివారెడ్డి, జవ్వాది సుబ్బారావు, కాబోలు పూర్ణచంద్రరావు, సూరె శ్రీనివాసరావు పాల్గొన్నారు.

ప్రతి కార్యకర్తకు వైఎస్సార్ సీపీ అండ

వైఎస్సార్ సీపీ సమన్వయకర్త బలసాని కిరణ్‌కుమార్



మాట్లాడుతున్న కిరణ్‌కుమార్

గుంటూరు రూరల్: ప్రతి కార్యకర్తకు వైఎస్సార్ సీపీ అండగా ఉంటుందని వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ సమన్వయకర్త బలసాని కిరణ్‌కుమార్ తెలిపారు. సోమవారం నగర శివారుల్లోని ఏటుకూరు బైపాస్‌లోని నియోజకవర్గం కార్యాలయంలో కార్యకర్తల సమావేశాన్ని నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ గ్రామ స్థాయిలో పార్టీ బలోపేతానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని కోరారు. కూటమి ప్రభుత్వం ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను తుంగలో తొక్కి నేడు గతంలో చేయలేకపోయారు.. మేము చేయలేకపోతున్నామని, ఆర్థిక పరిస్థితుల కారణంగా పథకాలు ఇవ్వలేకపోతున్నామని మొసలికన్నీరు కారుస్తున్నారని చెప్పారు. వలంటీర్లకు పదివేలు జీతాలు ఇచ్చి అందరికి ఉద్యోగాలు కల్పిస్తామని నేడు మాట దాటవేసి వలంటీర్లను కూటమి ప్రభుత్వం నట్టేట ముంచిందన్నారు. జాబ్ క్యాలెండర్ పేరుతో నిరుద్యోగులను మోసం చేసిందన్నారు. నేడు మరలా మరో కొత్త మోసానికి ఒడికడుతున్నారని ఇప్పటికే రాష్ట్ర వ్యాప్తంగా లక్షలాది మందికి పింఛన్‌లను నిలిపివేసి మరికొంతమంది పింఛన్లను తీసివేసే కుట్రలు పన్నుతున్నారని చెప్పారు. కూటమి ప్రభుత్వం చేస్తున్న కుట్రలను, ప్రజా వ్యతిరేక కార్యక్రమాలను ఎండగట్టే రోజులు దగ్గరలోనే ఉన్నాయని వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు అందుకు సిద్ధంగా ఉండాలని కోరారు.

సచివాలయ ఉద్యోగులపై వేధింపులు ఆపాలి



సభలో మాట్లాడుతున్న అబ్దుల్ రజాక్

పొన్నూరు: గ్రామ సచివాలయ ఉద్యోగులపై వేధింపులు ఆపాలని సచివాలయ ప్రభుత్వ ఉద్యోగుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు అబ్దుల్ రజాక్ అన్నారు. నిడుబ్రోలులోని ప్రగడ కోటయ్య ఫంక్షన్ హాల్‌లో సోమవారం రాష్ట్ర గ్రామ, వార్డు సచివాలయ ప్రభుత్వ ఉద్యోగుల సంఘం ఆధ్వర్యంలో పొన్నూరు కమిటీ సమావేశం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా సంఘ రాష్ట్ర అధ్యక్షులు షేక్ అబ్దుల్ రజాక్ పాల్గొని మాట్లాడుతూ గ్రామ వార్డు సచివాలయ ఉద్యోగులను కొంతమంది అధికారులు తీవ్ర ఒత్తిడికి గురి చేస్తున్నారని ఆరోపించారు. అత్యుత్సాహం ప్రదర్శిస్తు షోకాజ్ నోటీసులు, మెమోలు, సస్పెన్షన్ల పేరిట ఉద్యోగులను వేధింపులకు గురి చేస్తున్నారని అన్నారు. వివిధ సర్వే విధుల నుంచి గ్రామ సచివాలయ ఉద్యోగులకు మినహాయింపు ఇవ్వాలని పేర్కొన్నారు. జాబ్ చార్ట్‌లో లేని విధులన్నింటినీ సచివాలయ ఉద్యోగులకు కేటాయిస్తూ మానసిక వేదనకు అధికారులు గురి చేస్తున్నారని తెలిపారు. సచివాలయ ఉద్యోగులకు తక్షణమే పదోన్నతులు కల్పించాలని, నోషనల్ ఇంక్రిమెంట్లు, రావాల్సిన బకాయిలు ఇవ్వాలని, వివిధ విభాగాల ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి ప్రత్యేక కమిటీ నియమించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సంఘ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి పార్ష మధు మాట్లాడుతూ సచివాలయ ఉద్యోగులు ఐక్యతగా ఉంటూ, ఉద్యోగుల సమస్యల కొరకు కృషి చేసే ఈ సంఘానికి మద్దతు తెలపాలని కోరారు. అనంతరం ఆంధ్రప్రదేశ్ గ్రామ వార్డు సచివాలయ ప్రభుత్వ ఉద్యోగుల సంఘం పొన్నూరు పట్టణ కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. పొన్నూరు పట్టణ అధ్యక్షుడిగా షేక్ ఇమ్రాన్, కార్యదర్శిగా ఎం.శ్రీనివాసరావు, ఉపాధ్యక్షులుగా షేక్ బాజిద్‌బి, ఎస్.శ్రీకాంత్, టి.ఆనందరావు, సంయుక్త కార్యదర్శులుగా అశోక్ కుమార్, వెంకట సుబ్బమ్మ, కోశాధికారిగా సాయిరాం ఎన్నికయ్యారు. కార్యక్రమంలో పొన్నూరు పట్టణ సంఘ ముఖ్య నాయకులు గోపీకృష్ణ, శేషు, శిరీష,కిషోర్, లీలా కృష్ణ, రాజేష్, వినయ్ పాల్గొన్నారు.

రెడ్డిపాలెం ఇన్నర్ రింగ్ రోడ్డు పనులు వేగవంతం



సంజీవయ్యనగర్ వద్ద మెయిన్ రోడ్డు కొలతలను పరిశీలిస్తున్న కమిషనర్ పులి శ్రీనివాసులు

నెహ్రూనగర్: రెడ్డిపాలెం, ఇన్నర్ రింగ్ రోడ్ విస్తరణ పనులు వేగంగా చేపట్టడానికి చర్యలు తీసుకోవాలని, పట్టణ ప్రణాళిక, ఇంజినీరింగ్ అధికారులు సమన్వయంతో ప్రజలకు ఇబ్బందులు లేకుండా పనులు చేపట్టాలని నగర కమిషనర్ పులి శ్రీనివాసులు ఆదేశించారు. సోమవారం కమిషనర్ సంజీవయ్య నగర్ రైల్వే గేటు నుంచి రెడ్డిపాలెం, ఇన్నర్ రింగ్ రోడ్డు వరకు చేపట్టిన రోడ్డు విస్తరణ పనులను పరిశీలించారు. కమిషనర్ మాట్లాడుతూ మాస్టర్ ప్లాన్, రోడ్ డెవలప్మెంట్ ప్లాన్(ఆర్డీపీ) మేరకు రోడ్ విస్తరణ పనులు పక్కా ప్రణాళిక మేరకు పనులు జరిగేలా పట్టణ ప్రణాళిక అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. శంకర్ విలాస్ ఆర్వోబీ నిర్మాణ పనులు ప్రారంభమైతే నగరంలో ట్రాఫిక్ సమస్య పెరుగుతుందని, అందుకు తగిన విధంగా ఆయా మార్గాలను అభివృద్ధి చేసుకోవాల్సి ఉంటుందన్నారు. ప్లాన్ మేరకు తొలుత మార్కింగ్ చేసి, ప్రభావిత భవన యజమానులకు నోటీసులు అందించి, ఎకనాలడ్జిమెంట్ తీసుకోవాలని ఆదేశించారు. పట్టణ ప్రణాళిక అధికారులు భవనాల తొలగింపు చేపట్టిన అనంతరం వెంటనే డ్రైయిన్, రోడ్ నిర్మాణ పనులు ప్రారంభించడానికి ఇంజినీరింగ్ అధికారులు టెండర్ ప్రక్రియ పూర్తి చేసి సిద్ధంగా ఉండాలన్నారు. అనంతరం సంజీవయ్య నగర్ రైల్వే గేటు దగ్గర జరుగుతున్న పైప్ లైన్ ఇంటర్ కనెక్షన్ పనులను పరిశీలించి, పనులను త్వరగా పూర్తి చేయడానికి ఇంజినీరింగ్ అధికారులు చర్యలు తీసుకోవాలని, పనులను నాణ్యతగా చేపట్టేలా పర్యవేక్షణ చేయాలన్నారు. పర్యటనలో సిటీ ప్లానర్ రాంబాబు, ఎస్ఈ నాగమల్లేశ్వరరావు, డీసీపీ సూరజ్ కుమార్, ఈఈ కోటేశ్వరరావు, డీఈఈ రమేష్ బాబు, ఎస్ఎస్ ఆయూబ్ ఖాన్, ఏఈ రవి కిరణ్, శానిటరీ ఇన్‌స్పెక్టర్ అంగడి రాజేష్ పాల్గొన్నారు.

ఫార్మసీ ఔషధ అభివృద్ధిలో మెషిన్ లెర్నింగ్‌కు ప్రాధాన్యం



అతిథులను సన్మానిస్తున్న కళాశాల ప్రతినిధులు

గుంటూరు రూరల్: ఔషధ పరిశోధన అభివృద్ధి రంగంలో మెషిన్ లెర్నింగ్ అన్వయాలు శాస్త్ర పరిశోధనలో విప్లవాత్మక మార్పులు తీసుకువస్తాయని వీఐటీ ఏపీ యూనివర్సిటీ స్కూల్ ఆఫ్ కంప్యూటర్ సైన్స్ అండ్ ఇంజినీరింగ్ ప్రొఫెసర్ డాక్టర్ ఈ శ్రీనివాసరెడ్డి తెలిపారు. నగర శివారుల్లోని లాంలోని చలపతి ఫార్మసీ కళాశాలలో ఏర్పాటు చేసిన మిషన్ లెర్నింగ్ అప్లికేషన్స్ ఇన్ ఫార్మసీ అండ్ డ్రగ్ డెవలప్మెంట్ అనే అంశంపై ఏర్పాటు చేసిన ఒక్కరోజు వర్క్‌షాప్‌లో ఆయన పాల్గొన్నారు. ఆయన మాట్లాడుతూ ఆధునిక సాంకేతికతల సాయంతో మెషిన్ లెర్నింగ్ ఔషధ అభివృద్ధి ప్రక్రియను వేగవంతం చేయడంలో ఖర్చులను తగ్గించడంలో కీలక పాత్ర పోషిస్తుందని పేర్కొన్నారు. ఆధునిక డేటా ప్రాసెసింగ్ మోడల్స్ ఆల్గోరిథమ్స్ సహాయంతో మెషిన్ లెర్నింగ్, ఔషధ పరిశోధన అభివృద్ధి వ్యయాన్ని తగ్గించడంలో, సమయాన్ని ఆదా చేయడంలో మానవ జీవితాలను రక్షించడంలో కీలక పాత్ర పోషిస్తుందన్నారు. సాంకేతికత ఉపయోగంతో ఔషధ తయారీ సమయం 40 నుంచి 50శాతం వరకు తగ్గించబడిందన్నారు. కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ డాక్టర్ నాదెండ్ల రామారావు మాట్లాడుతూ మెషిన్ లెర్నింగ్ శక్తిని సద్వినియోగం చేసుకుంటే, అరుదైన క్లిష్టమైన రోగాలకు సమగ్ర ఔషధ పరిష్కారాలు అందించడంతో పాటు, ప్రజల జీవన ప్రమాణాలను మెరుగుపరచడం సాధ్యం అవుతుందన్నారు. కార్యక్రమంలో 11 కళాశాలల నుండి 160 మందికిపైగా విద్యార్థులు పాల్గొన్నారు.

కార్మికులకు పీపీఈ కిట్లు పంపిణీ

నెహ్రూనగర్: ప్రజారోగ్యం కాపాడే కార్మికులు తమ ఆరోగ్య పరిరక్షణకు కూడామ తగిన శ్రద్ధ చూపాలని, విధుల్లో తగిన రక్షణ పరికరాలు ధరించాలని నగర కమిషనర్ పులి శ్రీనివాసులు సూచించారు. సోమవారం కేంద్ర ప్రభుత్వ, రాష్ట్ర ప్రభుత్వ స్వచ్ఛాంధ్రప్రదేశ్ నేషనల్ యాక్షన్ ఫర్ మెకనైజ్డ్ శానిటేషన్ ఎకో సిస్టం(నమస్తే)లో భాగంగా గుంటూరు నగరపాలక సంస్థ పరిధిలోని అండర్ గ్రౌండ్ డ్రైనేజి (యూజీడీ) కార్మికులకు పర్సనల్ ప్రొటెక్షన్ ఎక్విప్మెంట్(పీపీఈ) కిట్లను కమిషనర్ అందించారు. కార్మికులు 121 మంది ఉండగా, వారిలో తొలుత 50 మందికి పీపీఈ కిట్లు అందించగా ప్రస్తుతం మరో 70 మందికి అందజేశారు. కార్యక్రమంలో అదనపు కమిషనర్ సిహెచ్.ఓబులేసు, డెప్యూటీ కమిషనర్ డి.శ్రీనివాసరావు, సీఎంఓహెచ్ డాక్టర్ అమృతం, ఈఈ సుందర్రామిరెడ్డి, నమస్తే స్కీం రాష్ట్ర కో ఆర్డినేటర్ అనిల్ కుమార్ పాల్గొన్నారు.

ఉపాధ్యాయులు ఆదర్శనీయులుగా ఉండాలి



గుంటూరు ఎడ్యుకేషన్: వృత్తి నిబద్ధతతో పాఠశాలకే అంకితమైన ఉపాధ్యాయులు ఆదర్శనీయులుగా నిలుస్తారని జిల్లా విద్యాశాఖాధికారి సీవీ రేణుక అన్నారు. వట్టిచెరుకూరు మండలం లేమల్లెపాడులోని మండల పరిషత్ ప్రాథమికోన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు పసుపులేటి శ్రీధర్ 2024లో ఏడాది పొడవునా ఒక్కరోజు కూడా సెలవు తీసుకోకుండా విధులు నిర్వర్తించినందుకు సోమవారం డీఈఓ కార్యాలయానికి ఆహ్వానించి సన్మానించారు. కార్యక్రమంలో వట్టిచెరుకూరు ఎంఈఓ గరిమెళ్ల సత్యనారాయణమూర్తి మాట్లాడారు. ఈసందర్భంగా ఉపాధ్యాయుడు శ్రీధర్ పాఠశాల పేరుతో దాతలు అందజేసిన నోటు పుస్తకాలు, విద్యార్థులు రాసిన యాత్రా గ్రంథం ''మా కళ్లతో కొండవీడు'' పుస్తకాన్ని డీఈఓ రేణుకకు అందజేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయుడు ఎం.రవికృష్ణ, కార్యాలయ అకౌంటెంట్ చందు శ్రీనివాసులు పాల్గొన్నారు.

సాక్షి
సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.
వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు
వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు
శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు
అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.
ప్రత్తిపాడు డివిజన్
90109 57733 (ప్రత్తిపాడు)
90109 62225 (పొన్నూరు)
Office mail : sakshigntadvt@gmail.com